కథానిక

# కాలాతీత దృష్టి

## వేదుల మీనాక్షీదేవి

"మున్నగాల పార్వతీశం ఇక్కడ వున్నాడా అబ్బాయ్?"

"... ... ... ..."

"ఏమోయ్, నిన్నే!"

"నన్నా! ఏంకావాలండి?"

"పార్వతీశం అనే అబ్బాయి యీ లాడ్జిలో నేనా వుంటం?"

"ఇక్కడే వున్నాడండి."

"ఒక్కమాటు యిటు పిలుస్తావూ?"

"ఎందుకండి?"

"అతనితో మాట్లాడే పనుంది లే."

"సంగతేమిటో చెప్పండి. అతను చదువుకుంటున్నాడు. తెల్లవారితే పరీక్ష. పనేదైనావుంటే అతనితో నేను చెబుతాను."

"మీతో చెప్పే సంగతి కాదు: అతనితోనే చెప్పాలి, రహస్యం."

"అయితే పిలుస్తాను. మీరిక్కడ వుండండి!" అని లోపలికి వెళ్ళిపోయాడు శ్రీనివాసు.

ఓ మోస్తరు పొడుగు, పొడుక్కితగ్గ లావుగా వున్నాడు. చామనచాయ. గోధుమరంగు ఖద్దరు పంచ, లాల్చీ, కండువా. కనుబొమ్మలమధ్య కానీ కాసంత కుంకంబొట్టు పెట్టుకున్నాడు. కాళ్ళకు ఆకు చెప్పులు తొడుక్కున్నాడు. అతిఖంగారుగా వైనతేయ లాడ్జికి పార్వతీశం అనే అతనికోసం వచ్చాడు ఒక ఆయన.

"ఇదేమిట్రా, ఈయనెవడో పార్వతీశం కావాలంటూ వచ్చాడు. ఎందుకండీ అంటే మాట్లాడే పనుందంటాడు. ఆమాటేదో వాడితోనే చెప్పాలి గాని మనతో చెప్పకూడదుట" అన్నాడు పక్క గదిలోని సీతారామయ్యతో శ్రీనివాసు.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను. పార్వతీశాన్ని పిలుచుకురావడమా, వచ్చిన ఆయన్ని వచ్చినదోవనే పంపడమా అని!" అన్నాడు సీతారామయ్య కనుబొమ్మలు ముడివేస్తూ.

"వెళ్ళగొడదామన్నా వెళ్ళే ఘటంలాగ లేడు. ఘరానావాడిలాగ కనబడుతున్నాడు. అలాంటప్పుడు పార్వతీశంతో చెప్పకపోవడం యెందుకు? కాక, వాళ్ళ దగ్గరబంధువో యేమిటో కూడాను. మనకి తెలియదు. వెళ్ళి చెప్పేద్దాంపద."

వాళ్ళంత తటపటాయించడానికి కారణం లేకపోలేదు. ఇంచుమించు నెలరోజులనుండి పార్వతీశం తిన్నగా చదవడంలేదు. వెనకటి శ్రద్ధ తగ్గింది. రెండుమూడు రోజులనుండి చదువు మామూలుధోరణిలో పడింది. అందుచేత అతని చదువుకి భంగం కలిగించడానికి మనస్కరించడం లేదు వాళ్ళకి.

ఇద్దరూ పార్వతీశం కోసం బయలుదేరారు. అప్పుడే స్నానంచేసి తువ్వాలు కట్టుకుని, సబ్బుపెట్టె చేత్తోపట్టుకొని పార్థసారథి యెదురయ్యాడు. "ఎక్కడికి?" అని ప్రశ్నించాడు వాళ్ళిద్దరినీ.

"పార్వతీశం కోసం ఎవరోవచ్చారు. అతనితో చెబుతామని అతని గదికి వెడుతున్నాము" అన్నారు శ్రీనివాసు, సీతారామయ్య. పార్థసారథి వాళ్ళతో పార్వతీశం గదికి వెళ్ళాడు.

పార్వతీశం తన గదిలో కిటికీదగ్గర కూర్చుని చదువుకుంటున్నాడు.

"ఒరేయ్ పార్వతీశం వెనకటిలాగ కాదు నీ సంగతి ఈ మధ్య నీ పలుకుబడి యెక్కువైపోతోంది. మళ్ళీ ఎవరో తమరికోసం విచ్చేశారు. దయచెయ్యాలి" అన్నారు సీతారామయ్య ప్రభృతులు.

"నిజంగా? నాకోసమే? ఎవరుబాబూ మళ్ళీను? 'లేడు' అని చెప్పలేకపోయారూ?" అన్నాడు పార్వతీశం విసుగ్గా.

"డౌన్‌రైట్‌గా అంతఅబద్ధంఆడలేకపోయాం" అన్నాడు శ్రీనివాసు.

"మరే! సత్యహరిశ్చంద్రులు బయలుదేరారు. కాస్త ఆపాటి అబద్ధం ఆడి నన్ను రక్షించలేకపోయారూ!" విసుక్కున్నాడు పార్వతీశం.

"అబ్బాయ్. కోపగించి లాభంలేదు. నువ్వు లేవని చెప్పలేదుగాని చదువుకుంటున్నావనీ, రావడానికి తీరుబడి లేదనీ చెప్పాము. కాని, అవచ్చిన ఆయన నువ్వే కావాలని భల్లూకపు పట్టుపట్టుకుని కూర్చున్నాడు. నీ గదికి తీసుకుని వస్తే తిష్ఠ వేస్తాడేమో వీధిలోనే మాట్లాడి పంపించేస్తావని ఆయ్నక్కడ నిలబెట్టి వచ్చాం. తప్పదు పద. అన్నాడు సీతారామయ్య.

విధిలేక పార్వతీశం లేచాడు. గది తలుపు తాళంవేసి నలుగురూ బయలుదేరారు.

రాజమండ్రీలో ఇన్నీసుపేటలో వుంటూండే ఆర్ట్సుకాలేజీ వీరేశలింగం,పురానికిమారింది క్రొత్తగా. అందుచేత ఆ చుట్టుపట్ల ఖాళీ స్థళాలుకొని అద్దెల కోసం గదులు కట్టారు చాలామంది. వీరేశలింగంగారి అనాథ శరణాలయానికి తూర్పుగావుంది వైనతేయ లాడ్జి. ఆ లాడ్జికి యెదర అంతా ఖాళీ స్థలం. పచ్చగడ్డికోసర పశువులమందల్ని అక్కడికి తోలుకుని వస్తారు పశుల కాపర్లు. చుట్టుపట్ల పిల్లలంతా సాయంత్రం అయేటప్పటికి అక్కడజేరి ఆడుకుంటారు. ఆ స్థలానికీ వైనతేయలాడ్జికి మధ్య గంగరావి చెట్టుంది పెద్దది. చాలాకాలంనాటిచెట్టు అవడంవల్ల బాగావిస్తరించి చుట్టూ సుమారుపది, పదిహేను గజాలమేర నీడగావుంటుంది. దట్టమైన ఆకులమధ్య పచ్చని, యెర్రని పువ్వులు యెంతో ఆకర్షణీయంగా వుంటాయి. పార్వతీశం తీరికగా ఉన్నప్పుడు ఆ చెట్టుదగ్గర నిలబడి పిల్లల ఆటలు చూస్తూంటాడు. బేట్ మెంటన్ అయితే ఒక్కొక్కప్పుడు ఆడనూ ఆడతాడు.

పార్వతీశం, వచ్చిన క్రొత్తాయనా ఆ రావిచెట్టు క్రిందకివెళ్ళి కూర్చున్నారు.

వైనతేయ లాడ్జిలో ఎనిమిది గదులున్నై. ఒక్కొక్కగదిలో ఒక్కొక్కవిద్యార్థి వున్నాడు. మొత్తం ఆ లాడ్జిలో యెనమండుగురు విద్యార్థులన్నమాట. అంతా బి. యే. వాళ్ళే.

"ఆ వచ్చిన ఆయన యెవరైవుంటాడా" అని వూహాగానం ప్రారంభించారంతా. పెళ్ళిసంబంధం కోసంవచ్చి వుంటాడనుకున్నారు. ఎందుకంటే విద్యార్థులను వారి బసలలో కలుసుకోవడము, అతని తెలివితేటల గురించి అతని స్నేహితులను, సహాధ్యాయులను అడిగి తెలుసుకోవడము, మేష్టర్ల ద్వారా పిలిపించి చూడడము, విద్యార్థి తల్లిదండ్రులకు తెలియకుండా పెండ్లికుమార్తెలను చూపించడము యిత్యాది పద్ధతులను ఆడపిల్లలు గలవాళ్ళు అవలంబించడం అందరికీ తెలిసిన విషయమే. అందుచేత వాళ్ళావిధంగా అనుకోవడంలో అసందర్భంగాని, ఆశ్చర్యంగాని లేదు.

"వీడెక్కడవపోగయూడ్రా? తెల్లవారితే పరీక్షలనగా తయారయాడు" అన్నాడు సీతారామయ్య.

"అసలు నాకు తెలియక అడుగుతానూ వీడిక్కడ నాలుగు సంవత్సరాలనించి చదువుతున్నాడు కదా! ఇన్నాళ్ళనుండి రావడానికి యీాయనకు తీరికలేక పోయిందా? సుముహూర్తం కుదరలేదా? ఇప్పుడు సిద్ధమయాడు సమయానికి" అన్నాడు శంకరం.

"చెరపడానికి చేటపెయ్యచాలుట. వీడి భవిష్యత్తు పాడుచెయ్యడానికి యీాకబుర్లు చాలు" అన్నాడు శ్రీనివాసు.

వరండాలో నిలబడి అంతా చెట్టుక్రింద కూర్చున యిద్దర్నీ చూస్తున్నారు.

"బహుశా వాడికి ఆ వచ్చినాయన పని తెలిసే వుంటుంది. ఆసంగతి మనకు తెలుస్తే మనం వేళాకోళం చేస్తామని యేమీ యెరగనట్టు నటించి వుంటాడు" అన్న సారధిమాటలతో అందరూ ఏకీభవించారు. ఎవరి గదులకు వారు చక్కాపోయారు చదువుకుందుకు...

వచ్చిన పెద్దమనిషి వెళ్ళిపోయాడు. పార్వతీశం తనగదికి వచ్చేసి మళ్ళీ చదవడానికికూర్చున్నాడు.

ఆ లాడ్జిలో విద్యార్థులు వాళ్ళ చదువు వాళ్ళు చదువుకుంటున్నా ఒక కన్ను పార్వతీశం మీద వేసేవుంటారు. అందుచేత అతను గదికిరావడం గమనించి ఒక్కొక్కరేవచ్చి చుట్టూ కూర్చున్నారు. ఎలా ప్రారంభించడమా సంభాషణ అని అంతా చూస్తూండగా.

"అయితే నాకు తెలియక అడుగుతానూ ఎందుకు వచ్చాడాయన?" అన్నాడు శంకరం.

"నాతో పనుండి వచ్చాడు" అని సమాధానం చెప్పి మళ్ళీ పుస్తకం చూస్తున్నాడు పార్వతీశం.

చూస్తున్న పేజీ, ఎంతసేపటికీ తిప్పకపోవడం చూసి "బ్రౌన్‌స్టడీలో పడ్డావేమిట్రా" అన్నాడు సీతారామయ్య.

అప్పుడు పది పేజీలు అటూయిటూ తిప్పుతూ మళ్ళీ ఆగిపోయాడు పార్వతీశం.

"పెళ్ళివిషయమే అన్నమాట" అన్నాడు పార్థసారధి. "ఊఁ" పరధ్యానంగా అన్నాడు యెటో చూస్తూ.

"అయితే నాకు తెలియక అడుగుతానూ ఒక నిర్ణయానికి వచ్చావన్నమాట" అడిగాడు శంకరం.

'అవును' పార్వతీశం ముక్తసరిగా జవాబిచ్చాడు.

పార్వతీశం తనంతతానైనా పలకరించలేదు. తల యెత్తి వచ్చినవాళ్ళందరినీ చూడనైనా లేదు. పుస్తకంకేసిచూస్తూ తలవంచుకుని కూర్చున్నాడు.

"అబ్బాయ్. ఒక్కవిషయం చెబుతాను విను. ఎవరికి పనివుంటే వాళ్ళువస్తారు. అందుకని మన పనులు ధ్వంసం చేసుకోకూడదు. ఆయన ఏ ముహూర్తాన వచ్చాడోకాని అదిమొదలు నువ్వు మన్నుతిన్న పాములాగ మందకొడిగా వున్నావు. ఏదో ఆలోచిస్తున్నట్లుంటున్నావు. పుస్తకంకేసి చూస్తున్న నువ్వు చదువుతున్నావని చెప్పడానికి వీల్లేదు. వెనుకటి ప్రసన్నతలేదు ముఖంలో. ఇంతలో యిలా మారిపోయావంటే మాకు చాలా ఆశ్చర్యంగాను, బాధగాను వుంది. పరీక్షలైపోయాక కావలసినంత ఆలోచిద్దువుగాని, ప్రస్తుతం ఆలోచనలు విడిచిపెట్టు. పన్నెండు గంటలకు వచ్చాడు ఇప్పుడు రెండుగంటలైంది. ఈ రెండుగంటలూ వృధా కాలక్షేపం అయింది. ఇకనైనా నీసంగతి ఆలోచించుకుని తిన్నగా చదువుకో" అని యెంతో బాధ్యత కలవాడిలాగ చెప్పాడు సీతారామయ్య.

సీతారామయ్య మాటలు విన్నాడో లేదో చెప్పలేముగాని, అతనికేసిమాత్రం చూస్తూవుండి పోయాడు చెప్పినంతసేపూ పార్వతీశం.

"అయితే నాకు తెలియక అడుగుతానూ మీ ఇంటిదగ్గర అంతాకులాసా? ఎవరికైనా అనారోగ్యంగావున్న కబురుకాదుగదా?" అని అడిగాడు శంకరం.

"అంతా కులాసాగానే వున్నారు." ముక్తసరిగా సమాధానం చెప్పాడు పార్వతీశం.

వాళ్ళప్రాణం విసిగిపోయింది. "ఏం చెప్పినా వినిపించుకోకపోతే యేంచేస్తాం. వాడికి తోచకపోతే చెపితేనైనా వినాలా వద్దా? కళ్ళయెదురుగా తెలివైన కుర్రాడు ధ్వంసం అవుతుంటే చూడలేక పోతున్నాం. ఎవడికర్మకి యెవరు కర్తలు! గ్రహాలు వక్రించినప్పుడు మంచిమాటలు చెవికెలా యెక్కుతాయి?" అనుకుని యెవరిగదికి వాళ్ళు చక్కాపోయారు. చదువుకుందుకు పార్వతీశం ఒక్కడూ గదిలో మధ్యగా మఠం వేసుకుని కూర్చుని అలాగే పుస్తకం తెరచి చూస్తున్నాడు. వాళ్లు వెళ్ళడం అతను గమనించినట్టేలేదు.

సాయంత్రం అయిదు గంటలు కావచ్చింది. సీతారామయ్య పార్వతీశం గదికి వచ్చాడుమళ్ళీ. పార్వతీశం అప్పుడే స్నానంచేసి శుభ్రంగా తయారయాడు. నవ్వుతూ సీతారామయ్యని పలకరించాడు. తలుపుతాళంవేసి బయలుదేరాడు. ఆ లాడ్జిలోని విద్యార్థుల నొక్కరొక్కర్నే పలకరించాడు. షికారువెళ్ళాడు. ఆ దోవనే హోటల్లో భోజనంచేసి వచ్చాడు. రాత్రి ఎనిమిదిగంటలకే నిద్రపోయాడు. తెల్లగా తెల్లవారి సూర్యకిరణాల మేలుకొలుపుతో లేచాడు. లేచాక అయినా అటూ యిటూ తిరిగాడేకాని పరీక్ష ఆదుర్దా అతనిలో కనబడలేదు. సీతారామయ్య ఒకటి రెండుమార్లు చదవమని చెప్పిచూశాడు.

"ఏమిటి చదివేది? చదివిందే చదవడంతో ప్రాణం విసిగెత్తిపోయింది ఇన్నాళ్ళనుండీ. చాలు లెస్తూ ఆ చదివింది" అన్నాడు పార్వతీశం నిర్లిప్తతతో.

"పరీక్ష పోతే పోయిందనే వుద్దేశంలో వున్నాడు. అలాంటివాడు పరీక్షకువెళ్ళి కూర్చుంటే మాత్రం యేంలాభం? చదవకపోయాక యేమి రాస్తాడు" అనుకున్నారు సహాధ్యాయులు.

మూడుగంటలూ వంచిన తల యెత్తకుండా వ్రాస్తున్న పార్వతీశాన్నిచూసి ఆశ్చర్యపోయారు తోటి విద్యార్థులు, స్నేహితులు. వ్రాయడనుకున్న పార్వతీశం వ్రాసేస్తున్నాడు. ఎంతో కష్టపడి చదివిన తాము వ్రాయలేకపోతున్నారు.

"పేపరు యెలావ్రాశావు" అని అడిగారు ఇవతలకి రాగానే.

"బాగానే వ్రాశా"నన్నాడు పార్వతీశం.

"పేపరు చాలా కష్టంగా వుంది. చదివినదానికి ప్రశ్నలకి సంబంధంలేదు. అంతా సగంసగంవ్రాశాం" అన్నారు.

"ఏమో. నాకు సులువుగానేవుంది. మీకు కష్టంగావుందా" అన్నాడు పార్వతీశం.

"తెలివైన బుర్ర అయితే యెప్పుడు చదివినా జ్ఞాపకం వుంటుందన్నమాట. పరీక్షహాల్లో అడుగు పెట్టే ఆఖరిక్షణందాకా చదివితే మతిపోయినట్లై ఒక్కటీ సమయానికి జ్ఞాపకంరాదు. కాస్త అవి జ్ఞాపకం వుండేందుకు మెదడుకుకాస్త విశ్రాంతి అవసరం అన్నమాట" అని తమ తెలివితక్కువను నిందించుకున్నారు.

ఆనాటి మధ్యాహ్నం పార్వతీశం పేపరు చదువుతున్నాడు. చిత్రమైన ఒక ప్రకటనగల కాలమ్ అతనిదృష్టి నాకర్షించింది. విశాఖపట్నం పిచ్చిఆసుపత్రి అధికారులు చేసిన ప్రకటన అది. "వారంరోజులక్రితం మా ఆసుపత్రినుండి శేషాచలం అనే ఒక పిచ్చివాడు తప్పించుకుని పారిపోయాడు. ఆయన ఎం. ఏ. ప్యాసైనాడు. కాలేజీలో మేష్టరుగా పనిచేస్తూండగా మతిపోయింది. ఓ మోస్తరు పొడుగు, పొట్టికాకుండా వుంటాడు. పొడుక్కితగ్గ లావుగా వుంటాడు. చామనచాయ, గోధుమరంగు ఖద్దరుపంచ, లాల్చీ, కండువా, కనుబొమ్మలమధ్య కానీకాసంత కుంకం బొట్టు పెట్టుకుంటాడు. కాళ్ళకు ఆకుచెప్పులు తొడుక్కుంటాడు. పెద్దమనిషి లాగే కాని పిచ్చి వానిలాగ కనబడడు. అస్తమానమూ పాఠాల గొడవ, పరీక్షలగొడవే అతనికి. పరీక్షలో వచ్చే ప్రశ్నలు తనకు తెలుసునని చెబుతూంటాడు. ఆయన కనబడితే మాకు తెలియ జెయ్యండి"... నిర్ఘాంతపోయాడు పార్వతీశం.

పార్వతీశం మనస్సులో శేషాచలం జీవితం ఒక్కమారు మెరిసింది. శేషాచలం మేష్టరీ చెయ్యడం, అతన్ని కుర్రాళ్లు నిష్కారణంగా హేళన చెయ్యడం, బెలూన్లువూదడం, ఆయన కుర్చీ కోళ్ళకింద నేలటపాకాయలు పెట్టడం, చిట పటాలుగీసి ఆయనకాళ్ళలో పడెయ్యడం, ఆయన ఖంగారుపడిపోయి పిల్లలమీద కేకలు వెయ్యడం, అపరాధిని దండించడానికి పంచె పైకి యెగకట్టి, చొక్కాచేతులు పైకితోసుకుంటూ పరిగెట్టే టప్పుడు వాళ్ళు బెంచీ యెక్కితే తనూ యెక్కడం, వాళ్ళుదిగితే దిగడం, పక్కక్లాసులలో పాఠాలు సాగకపోవడం చేత అంతా యివతలకివచ్చి ఆయన్ని చూడడం, కొందరు నవ్వుకోనడం, కొందరు "అమాయకుడు పాపం. వాళ్ళతో చాలగలడా?" అనుకోవడం, క్రమంగా విద్యార్థులవల్లేమతిపోవడం,ఆకారణంగా వుద్యోగం పోవడం, పూటగడిచే సాధనంలేక కుటుంబం అవస్థపడడం, ఆయన మతిలేక వీధుల్లో తిరగడం సినీమాలాగ కళ్ళకుకట్టినట్టు కనబడ్డాయి పార్వతీశానికి. ఆయన పిచ్చి ఆసుపత్రిలో వున్నట్టు గాని, అక్కడనుండి పారిపోయినట్టుగాని తెలియ దతనికి. తనెరుగున్నప్పుడు శేషాచలానికిబొట్టులేదు.

అప్రయత్నంగా అతని చేతిలోని పత్రిక జారి క్రిందపడిపోయింది!

అరె! పత్రికలో వర్ణన సరిగ్గా సరిపోయింది! ముందురోజున తనదగ్గరకివచ్చిన అపరిచితుడు శేషాచలంగారే! తనెరుగున్నప్పటికీ యిప్పటికీ చాలా మార్పుంది. అసలుపోలికే మారిపోయింది. ఐనా తన అన్నయ్యకి తెలిసినంతగా తనకు తెలియదు. తన అన్న ఆయనదగ్గర చదువు కున్నాడు. ఎప్పుడైనా తను అన్నయ్యతో వెళ్లే వాడుచిన్నప్పుడు. అందుకే ఆయనకింకా జ్ఞాపకం వుందికాబోలు! అన్నయ్యంటే ఆయనకెంతో అభి మానం. మునగాల పార్వతీశం అంటూ తన యింటి పేరుతోసహా చెప్పి మేలుకోరిన వాడిలాగ వెతు క్కుంటూవచ్చి ఎంత ఆప్యాయంగా మాట్లా డాడు! "రేపటి పరీక్షలో వస్తాయి. జాగ్రత్తగా చదువుకో, నేను చెప్పినట్లు యెవ్వరికీ చెప్పకుసుమా! నీకూ, నాకూ కూడా తంటా వస్తుంది" అని అయిదు ప్రశ్నలు చెప్పి వెళ్ళాడు! ఆయన వెళ్ళిందిమొదలు ఆ ప్రశ్నలకి సమాధానాలు చది వాడు తను! మరేమీ చదవేలేదే!

పార్వతీశం ఆశ్చర్యానికి మేరలేదు. అదేమి చిత్రమోకాని ఆయన చెప్పిన ప్రశ్నలు సరిగ్గా వచ్చేశాయి! ఎలా వూహించగలిగాడో కదా పిచ్చి వాడు! పాపం, పాఠాలు చెప్పేవాళ్ళయినా వూహించలేరు పరీక్షల్లో వచ్చే ప్రశ్నల్ని!

"పనికివచ్చే ప్రశ్నలు చెప్పి మహోపకారం చేసే శేషాచలం పిచ్చివాడా?" విస్తుబోయి శూన్యం లోకి చూస్తున్నాడు పార్వతీశం. ★